క్లుప్తంగా

ముగిసిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు



కూచిపూడి నృత్య ప్రదర్శన

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ 106వ ఆరాధనోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని భీమవరం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించారు. సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు గాదిరాజు సుబ్బరాజు, చెరుకువాడ సుబ్రహ్మణ్యం రాజు జ్యోతి ప్రజ్వలన చేయగా డాక్టర్ సీహెచ్ అజయ్ కుమార్ శిష్య బృందం (విజయవాడ) వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, కారుమూరి ఆదిత్య, పర్యవేక్షకులు చెరుకువాడ రంగసాయి, వెంకట్రామయ్య, కారుమూరి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

భీమవరం: వ్యానులో అక్రమంగా తరలిస్తున్న పశువులను స్వాధీనం చేసుకుని ఇరువురిని అరెస్టు చేశామని వన్‌టౌన్ ఎస్సై బి.వై. కిరణ్‌కుమార్ తెలిపారు. వాహన తనిఖీలు చేస్తుండగా 3 గోవులు, 6 ఎద్దులు, ఒక పెయ్యి దూడను అక్రమంగా తీసుకువెళ్తున్న గొలగాని ఆదినారాయణ, అల్లు కిషోర్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

బాలాత్రిపురసుందరీ మాతకు ప్రత్యేక పూజలు



తులసి దళాలల అలంకరణలో బాలాత్రిపుర సుందరీ అమ్మవారు

భీమవరం (ప్రకాశంచౌక్): ముక్కోటి ఏకాదశి సందర్భంగా మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలాత్రిపురసుందరీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి తులసి దళాలతో వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో పట్టణానికి చెందిన కాటం తాతాజీ దంపతులచే అర్చకులు కొమ్ము శ్రీనివాస్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

వీరవాసరం: వివిధ రకాల చార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపడం సరికాదని సీపీఎం నాయకుడు జుత్తిగ నరసింహమూర్తి విమర్శించారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని, రైతులకు స్మార్ట్ మీటర్లు పెట్టమని ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో ప్రజలపై రూ.15,485 కోట్లు ఫిక్స్‌డ్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, ట్రూ అప్ చార్జీలు పేరుతో ప్రజల ముక్కు పిండి వసూలు చేయడం సరికాదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా అధికారంలోకి వచ్చిన తర్వాత మరోలా వ్యవహరించడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. దొడ్డి దారిన ప్రజలపై వేలకోట్ల బారాలు వేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ బొర్రా అల మహారాజు, మండల నాయకులు పోతుల మృత్యుంజయ, తాళ్లూరి రాము, అయినపూడి బాబురావు, రెడ్డి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయాలి

పాలకోడేరు: ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు సొంతగృహం లేక అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నిరు పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు విస్సాకోడేరు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించి, సర్పంచ్ బొల్లా శ్రీనివాస్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అలాగే గృహ నిర్మాణానికి ఐదు లక్షలు రూపాయలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే దశల వారీగా పోరాటాలను చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వైపీ ఆనంద్, ఎం.లక్ష్మీపతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నిలయానికి స్వర్ణోత్సవం

- వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 50 ఏళ్లు పూర్తి
- స్ఫూర్తిదాత చింతలపాటి వర ప్రసాదమూర్తి రాజు



దుంపగడపలో వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల



స్వర్ణోత్సవ పైలాన్‌ను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఆకివీడు: నిరక్షరాస్యతను నిర్మూలించి, అక్షర ఆయుధాన్ని పేద పిల్లల చేతికి అందించాలి. స్వర్గీయ చింతలపాటి వర ప్రసాద మూర్తిరాజు వజ్రాయుధాల్లాంటి పౌరులను సమాజానికి అందించాలనే ఆశయంతో కుగ్రామంలో ఉన్నత విద్యా పీఠాన్ని ఏర్పాటు చేశారు. విద్య వెలకట్ట లేని సంపద అని గ్రహించి, పేద పిల్లలకు అందజేయాలనే ఉద్దేశ్యంతో 1974లోనే వరాహగిరి వెంకటగిరి(వీవీ గిరి) కళాశాల రూపంలో నాటిన విద్యా విత్తనం సుగంధాలను వెదజల్లుతుంది. దుంపగడపలో వికసించిన ఆ సుగంధ పరిమళానికి 50 వసంతాలు నిండాయి. ఈ సందర్భంగా ఈ నెల 12వ తేదీన స్వర్ణోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవం పూర్వ విద్యార్థుల కలయికకు వేదిక కానుంది.

అందుబాటులో కంప్యూటర్ విద్య

కళాశాలలో బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్, విద్యతో పాటు బీఎస్సీ ఆనర్స్ ఫిజిక్స్, బీఏ ఆనర్స్ ఎకనామిక్స్, బీకాం ఆనర్స్ కంప్యూటర్ అప్లికేషన్స్, ఎమ్మెస్సీ కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం కళాశాలలో 175 మంది విద్యార్థులు చదువుతున్నారు.

కార్పొరేట్ స్థాయిలో వసతులు



వసతుల లేమితో కొట్టుమిట్టాడిన కళాశాల నేడు కార్పొరేట్ స్థాయిలో వసతులను కలిగిఉంది. అదే స్థాయిలో విద్యార్థులకు విద్యా బోధనను అందజేసి, మంచి ఫలితాలను సాధిస్తున్నాం. రాబోయే రోజుల్లో కళాశాలను డీమ్డ్ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– డాక్టర్ కె.సుజాత, ప్రిన్సిపాల్, వీవీ గిరి కళాశాల

విద్యా ప్రదాత మూర్తిరాజు



విద్యా ప్రదాత మూర్తిరాజు వలన మాది విద్యా కుటుంబమైంది. మా కుటుంబంలోని నలుగురం ఇక్కడే చదివాం. ఉపాధ్యాయుడిగా సేవలందించాను. మా బ్యాచ్‌లో 22 మంది చదువుకోగా, నేడు 13 మంది జీవించి ఉన్నారు. కళాశాల స్వర్ణోత్సవాలు చేసుకోవడం కళ్లారా చూసే అవకాశం దక్కింది.

– భమిడిపాటి సూర్య భాస్కరరావు, మొదటి బ్యాచ్ విద్యార్థి

కాలేజీ లేకుంటే చదివేవాళ్లం కాదు



దుంపగడపలో కళాశాలను ఏర్పాటు చేయకపోతే చదువుకునే వాళ్లం కాదు. చిరు వ్యాపారాలతో జీవనం సాగించేవారం. అందుబాటులో కళాశాల ఉండటంతో రెండో బ్యాచ్ విద్యార్థిగా నేను చదువుకుని రైస్ మిల్లర్‌గా ఎదిగి, నేడు ఎంతో మందికి సేవలందిస్తున్నాను. పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షుడిగా సేవలందించడం నాకు ఎంతో ఆనందంగా ఉంది.

– గొంట్లా కృష్ణమూర్తి, రెండో బ్యాచ్ విద్యార్థి, ఆకివీడు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఉండి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఉండి ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు. మండలంలోని చెరుకువాడ, అర్తమూరు, మహదేవపట్నం, పాందువ్వ, కలిగొట్ల ఆరేడు,యండగండి, ఎన్నార్పీ అగ్రహారం గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పండుగ చాటున ఎవరైనా కోడి పందేలు, జూదం, గుండాట, అశ్లీల నృత్యాల వంటివి నిర్వహిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామ స్థాయిలో సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని కోరారు.

‘కూటమి’ నిర్లక్ష్యంతోనే తిరుపతి ఘటన

ఉండి: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే తిరుపతి ఘటన జరిగిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జి.సుందర్‌కుమార్ అన్నారు. తిరుపతి తొక్కిసలాట ఘటనపై శుక్రవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వానికి తిరుపతి లడ్డూపై చేసిన అసత్య ప్రచారంపై ఉన్న శ్రద్ధ భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో లేదని మండిపడ్డారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా పది రోజులు నిర్వహించే కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున వస్తారని తెలియకుండానే పాలన చేస్తున్నారా అంటూ విమర్శించారు. ఈ ఘటనపై టీటీడీ ప్రతిష్ట అంతర్జాతీయ స్థాయిలో మంటగలిసిందని అన్నారు. భక్తులు ప్రాణాలు కోల్పోతే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఎంత వరకు సమంజసమన్నారు.

ఏపీ బహుజన జేఏసీ నూతన రాష్ట్ర కమిటీ ప్రమాణస్వీకారం



ఏపీ బహుజన జేఏసీ నూతన రాష్ట్ర కమిటీ ప్రమాణస్వీకారం చేసిన దృశ్యం

భీమవరం: ఏపీ బహుజన జేఏసీ నూతన రాష్ట్ర కమిటీ భీమవరం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో శుక్రవారం ప్రమాణస్వీకారం చేసినట్లు గౌరవాధ్యక్షుడు కాటం స్టాన్లీరాజు, ఫౌండర్ కన్వీనర్ తాళ్లూరి మధు చెప్పారు. రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా దుండి అశోక్‌బాబు, ముఖ్య సలహాదారులు గా గరికిపాటి చంద్రకళ, గొల్లమందల స్టాన్లీ జోన్స్, ఇల్లూరి సంపత్, నందమూరి యోహాను, సోషల్‌మీడియా కన్వీనర్‌గా బందెల ప్రమీలారాణి, కోశాధికారిగా పిల్లా శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బందెల కెనడి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా బడుగు అశోక్‌బాబు, జాయింట్ సెక్రటరీగా బందెల జార్జిరాజు, అసోసియేట్ ట్రెజరర్‌గా సత్యాల శాంతకుమారి, కోఆర్డినేటర్‌గా గరికిముక్కు మేరిఆలీషా, మోనటరింగ్ అధ్యక్షుడిగా పాలవెల్లి మంగ, ఫైనాన్స్ సెక్రటరీగా చిగురుపాటి రాహేలు, ప్రచారకమిటీ చైర్మన్‌గా బంగా ఆదాము, ఆర్గనైజింగ్ డ్రాఫ్టింగ్ చైర్మన్‌గా పిల్లి అమూల్యారావు, క్రమశిక్షణ కమిటీ డైరెక్టర్స్‌గా జాలే సునీత, బోడిగడ్డ యెహాషువా, యూత్ కన్వీనర్‌గా పోతుల శ్వేత, యూత్ సెక్రటరీగా అంకం లోకేష్, జిల్లా ప్రెసిడెంట్‌గా కందికట్ల నాగరాజు ప్రమాణస్వీకారం చేసినట్లు స్టాన్లీరాజు, మధు తెలిపారు.

● సరదాల సంక్రాంతి



భీమవరం సీఎస్ఎన్ కళాశాలలో అధ్యాపకులు సంక్రాంతి సందడి

పాఠశాలల్లో ముందస్తు వేడుకలు



భీమవరం సీఎస్ఎన్ కళాశాలలో భోగిమంట దృశ్యం

భీమవరం: పట్టణంలోని డాక్టర్ చీడే సత్యనారాయణ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ భోగిమంటను వెలిగించి సంబరాలు ప్రారంభించారు. విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ దుస్తులు ధరించి ముగ్గులు వేసి, బొమ్మల కొలువు ఏర్పాటు చేసి ఆట, పాటలతో ఆకట్టుకున్నారు. వివిధ రకాల పిండి వంటలు ప్రదర్శించారు. చిన్నపిల్లలకు భోగిపళ్లు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సకుమళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం పట్ల అవగాహన అవసరం



గొల్లవానితిప్ప యూనియన్ బ్యాంకులో ఖాతా పుస్తకాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే వృత్తి నైపుణ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐటీ నిపుణులు వి. మౌనిక, కుమార్‌లు అన్నారు. భీమవరం మండలంలోని గూట్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రేసింగ్ పథకం (పీఎమ్ఎస్ఆర్ఐ)లో భాగంగా శుక్రవారం విద్యార్థులను యూనియన్‌బ్యాంక్, బీవీ రాజు నాలెడ్జ్ సెంటర్లకు తీసుకువెళ్లి వృత్తి నైపుణ్యం పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐటీ నిపుణులు వి. మౌనిక, కుమార్‌లు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఉద్యోగ, ఉపాధి పట్ల పాఠశాల స్థాయి నుంచే అవగాహన ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులను గొల్లవానితిప్పలోని యూనియన్ బ్యాంకుకు, బీవీరాజు నాలెడ్జ్ సెంటర్‌కు తీసుకువెళ్లి వృత్తి నైపుణ్యంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు మేలు



తణుకులో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

తణుకు అర్బన్: వ్యాధులకు భయపడడం కన్నా ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే అనారోగ్యాలకు దూరంగా ఉండవచ్చని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 29, 30 వార్డుల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే, సీజనల్ వ్యాధులపై వైద్య శాఖ నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. వారానికోసారి ఇంటి ఆవరణతో పాటు గృహాల్లో నీరు నిల్వ ఉండే సామగ్రిని శుభ్రం చేసుకోవడం ద్వారా దోమ పుట్టుకను లార్వా దశలో చెక్ పెట్టవచ్చని తెలిపారు. మలేరియా, చికున్ గున్యా వ్యాధులను నిరోధించవచ్చని స్పష్టం చేశారు. అతిసారం, టైఫాయిడ్, కామెర్లను కట్టడి చేయడంలో చేతుల శుభ్రత, ఆహార పదార్థాలు ఉన్న పాత్రలపై మూతలు ఉంచడం, కాచి చల్లార్చి వడపోసిన నీటిని తాగడం వంటి జాగ్రత్తలు పాటించడం కీలకమని అన్నారు. కార్యక్రమంలో ఫైలేరియా యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రెటరీలు బి.వెంకట రమణ, కె.అనుషా సువర్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

- వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలు
- బారులు తీరిన భక్తులు



జువ్వలపాలెం రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు



హౌసింగ్ బోర్డుకాలనీలో ఉత్తర ద్వారం దర్శనమిస్తున్న వెంకటేశ్వరస్వామివారు

భీమవరం (ప్రకాశంచౌక్): గోవింద నామస్మరణతో మార్మోగింది. మార్గశిర శుద్ధ ఏకాదశి (వైకుంఠ ఏకాదశి) పర్వదినం సందర్భంగా శుక్రవారం పలు వైష్ణవ క్షేత్రాల్లో తెల్లవారుజాము నుంచి స్వామి వార్ల ఉత్తర ద్వార దర్శనాలకు భక్తులు బారులు తీరారు. స్వామి వార్లకు విశేష అలంకరణ చేశారు. భీమవరం జువ్వలపాలెం రోడ్డులో పద్మావతి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం నుంచి వైకుంఠద్వార దర్శనాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ వంశపారం పర్య ధర్మకర్త మంతెన రామ్‌కుమార్ రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు, సిబ్బంది పాల్గొన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకా దశి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. స్వామివారిని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజిబాబు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తదితరుతు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కంతేటి వెంకట్రాజు, ఆలయ కమిటీ సభ్యులు దర్శించుకున్నారు. మారుతీ టాకీస్ సెంటర్‌లో దాసాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ జి.సీతారామరాజు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు

భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రు, యనమదుర్రు, చినఅమిరం, రాయలం, తాడేరు, బేతపూడి, తుందుర్రు, వెంప, అనాకోడేరు, కొమరాడ, గొల్లవానితిప్ప, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, దొంగపిండి, నాగిడిపాలెం తదితర గ్రామాలలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా దేవాలయాలకు భక్తులు పోటెత్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో శ్రీ పార్వతి శక్తీశ్వర స్వామి, వెంకటేశ్వరస్వామి, శ్రీ కనకదుర్గమ్మ, పర్లమ్మ, మారెమ్మ, శ్రీ అభయాంజనేయస్వామి వార్ల ఆలయాలకు భక్తులు పసుపు, కుంకుమ, గౌరి, విఘ్నేశ్వర తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

నయనానందం.. ఉత్తర ద్వార దర్శనం



కాళ్ల: ప్రత్యేక అలంకరణలో స్వామివారు



కాళ్ల: స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆకివీడు: ఉత్తర ద్వార దర్శనమిస్తున్న స్వామివారు



ఆకివీడు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా అమ్మవార్ల గ్రామోత్సవం

కాళ్ల: ఏడుకొండల వాడా, వెంకటరమణ, గోవిందా గోవిందా అంటూ కాళ్లకూరు గ్రామం మారుమోగింది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా గ్రామం ఆధ్యాత్మిక చింతన, భక్తి పారవస్యంతో నిండిపోయింది. గ్రామంలో వేంచేసియున్న స్వయంభూః శ్రీ వెంకటేశ్వర స్వామి వారు ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని శుక్రవారం ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు చేశారు. స్వామి వారి దర్శనానికి తెల్లవారు జాము నుంచి భక్తులు క్యూ కట్టారు. కృష్ణా, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలలోని చుట్టుప్రక్కల గ్రామాలనుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు బారులు తీరారు. టీటీడీ మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, గోకరాజు నరసింహారాజు, సర్పంచ్ సాధు శ్రీదేవి, కొత్తపల్లి నాగరాజు, మంతెన పెదనరసింహారాజు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్య నిర్వహణాధికారి మోకా అరుణ్‌కుమార్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అధిక సంఖ్యలో క్యూ కట్టిన భక్తులు

ఆకివీడు: భక్తులు ఉత్తర ద్వార దర్శనానికి పెద్ద ఎత్తున క్యూ కట్టారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం శుక్రవారం వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మాదివాడలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ, రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలోనూ, సంతమార్కెట్‌లోని కల్యాణ రామాలయంలోనూ, వెలంపేట లోని కోదండరామాలయంలోనూ కృష్ణుడి అలంకరణలో స్వామిని భక్తులు దర్శించుకున్నారు.

గ్రామోత్సవం

ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి వార్లను పల్లకిలో ఊరేగించారు. భక్తులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

తణుకు అర్బన్: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేయాలని సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు డిమాండ్ చేశారు. నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతిళ్లులేని పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం కేటాయిస్తామన్న వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు.